సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం ı 11 ı మార్చి ı 2025



యువతను వంచించిన చంద్రబాబు

ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అధికారం చేపట్టాక చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్‌లు యువతను నయవంచన చేశారని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల విమర్శించారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళ॥ (సా॥)	సహర్ బుధ॥ (ఉ॥)
రాయచోటి :	6.29	5.05
రాజంపేట :	6.26	5.13
పీలేరు :	6.29	5.03
మదనపల్లె :	6.31	5.07

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.120
రెండోరకం	రూ.60	రూ.90

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 80 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

అసంపూర్తి గృహాలకు అదనపు ఆర్థిక సహాయం

– జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్



రాయచోటి : 2019–24 మధ్య కాలంలో బీసీ,ఎస్సీ,ఎస్టీలకు మంజూరైన గృహాలు పూర్తి కాకుండా అసంపూర్తిగా ఉన్న వాటిని పూర్తి చేయడానికి అదనంగా ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసిందని సోమవారం అధికారుల సమావేశంలో జిల్లా కలెక్టర్ చెప్పారు. స్వర్ణాంధ్ర–2047 విజన్ సాకారంలో భాగంగా 2029 నాటికి అందరికీ ఇల్లు ఏర్పరచాలనే దృఢ నిశ్చయంతో అసంపూర్తి ఇళ్ల నిర్మాణాల పూర్తికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలో దాదాపు 25 వేల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీల గృహాల వివిధ దశల్లో నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. నిర్మాణం పూర్తికి ఎస్సీలు, బీసీలు అందరికీ రూ. 50 వేలు, ఎస్టీలకు రూ.75వేలు చొప్పున అదనంగా ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. లబ్ధిదారులు ఇల్లు పూర్తి చేసుకోవడానికి తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీ శివయ్యను కలెక్టర్ ఆదేశించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఓబులవారిపల్లె : ఉమ్మడి కడప జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆంజనేయరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి గురుకులంలో 6,7,8వ తరగతులకు సంబంధించి ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకు ఎపీఆర్ఎస్‌టీఏటీ– 2025 ద్వారా ప్రవేశ పరీక్షలు నిర్వహించి ఎంపిక చేస్తామన్నారు.ఉమ్మడి జిల్లాలోని బాలురకు ముక్కవారిపల్లి గురుకుల పాఠశాలలో, బాలికలకు మైలవరం గురుకుల పాఠశాలలో అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తికల వారు ఏపీఆర్ఎస్.సీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్చి 31 వరకు గడువు ఉందన్నారు. ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్షను ఉంటుందని చెప్పారు. పూర్తి వివరాలకు 8712625056 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

యువతకు శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ (వైఎస్సార్ జిల్లా): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో డీడీయూ–జీకేవై పథకం ద్వారా సి–డ్యాప్ సౌజన్యంతో 18–32 సంవత్సరాల మధ్య వయస్సుగల యువతీ యువకులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ రీజినల్ కో ఆర్డినేటర్ ఎం.సుబ్బరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు నెలల కాల వ్యవధిలో ఎలక్ట్రానిక్ కంప్యూటర్ హార్డ్‌వేర్, హెల్త్‌కేర్, ఎమెర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, ఐటీ సెక్టార్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, బ్యూటీ వెల్‌నెస్ సెక్టార్, బ్యూటీ థెరపీ కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఇతర వివరాలకు 90630 82227 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఎస్ఎస్ఏలో నూతన నియామకం



డాక్టర్ సుష్మితారెడ్డి

కడప కోటిరెడ్డి సర్కిల్ : అన్నమయ్య జిల్లా సమగ్ర శిక్ష ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులలో కెరీర్ మానసిక ఆరోగ్య కౌన్సెలర్‌గా కడప నగరానికి చెందిన డాక్టర్ సుష్మితారెడ్డిని నియమించారు. ఈ మేరకు సోమవారం ఆమెకు అధికారికంగా ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా డాక్టర్ సుష్మితారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు సరైన కెరీర్ మార్గదర్శకత్వం, మానసిక ఆరోగ్య సలహాలు అందించడం ద్వారా వారి భవిష్యత్‌ను మెరుగుపరిచేందుకు తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు.

వైభవం..పల్లకీ ఉత్సవం



పల్లకీలో ఊరేగుతున్న స్వామి, అమ్మవారు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేతుడికి పల్లకీ సేవ నిర్వహించారు.సోమవారం ప్రధాన అర్చకులు శంకరయ్యస్వామి, కృష్ణయ్య స్వామి, రాచరాయయోగీ స్వామి, శేఖర్ స్వామిల ఆధ్వర్యంలో మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు.అనంతరం ఉత్సవమూర్తులకు రంగురంగుల పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చారు. ఆలయమాఢవీధులలోల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో డీవీ రమణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ముందుంది.. నీటి ముప్పు

- ఇప్పటికే రాయచోటిలో దాహం కేకలు
- పల్లెల్లో సైతం మోగుతున్న తాగునీటి సైరన్

జిల్లాలో పంచాయతీలు	501
ఒక్కోమనిషికి రోజుకు అవసరయ్యే నీరు	55 లీ.
జిల్లా వ్యాప్తంగా సీపీబ్ల్యూ స్కీములు	10
బోర్లు	8946
ఎండిపోయిన సీజనల్ బోర్లు	2980

సాక్షి రాయచోటి : జిల్లాలో తాగునీటికి ప్రమాద ఘంటికలు కళ్లెదుటే కనిపిస్తున్నాయి. వేసవి తాపం భయపెడుతుండగా ప్రజలు తీరని దాహంతో అల్లాడిపోతున్నారు. జిల్లాకేంద్రమైన రాయచోటిలో ఇప్పటికే ప్రజలు మంచినీరో రామచంద్రా...అంటున్నారు. అనేక కాలనీల్లో నీరు రావడానికి నాలుగైదు రోజుల సమయం పడుతుందంటే పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయో అర్థమవుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటడం ప్రారంభమైన నేపథ్యంలో చెరువులు, కుంటల్లో ఉన్న నీరు ఇంకిపోతే బోర్లలో కూడా కనీస నీటిమట్టం గగనమవుతుంది. ఇప్పటికే తాగునీటి బోర్లలో రోజురోజుకు నీరు ఇంకిపోతుండడం ఆందోళన కలిగించే పరిణామం. పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా రానున్న కాలంలో విపత్కర పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఎందుకంటే ఈసారి ఆశాజనకంగా వర్షాలు లేకపోవడంతో పూర్తి స్థాయిలో ఎక్కడా కూడా పూర్తి స్థాయిలో చెరువులు, కుంటలు కనిపించడం లేదు. ఇప్పుడిప్పుడే తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చుతున్నా ఏప్రిల్, మే నెలల్లో మరింత తీవ్రం కానుందని తెలుస్తోంది. పరిస్థితి తీవ్రతను ముందే అంచనా వేసి ఈ పాటికే నివారణ చర్యలు చేపట్టి ఉంటే ప్రజలకు తాగునీటి కష్టాలు కొంతవరకైనా తప్పేవి. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి డైవర్షన్ పాలిటిక్స్, ప్రచార పటాటోపాలపై ఉన్న ఆసక్తి ప్రజల పట్ల లేకపోవడమే ఈ దుస్థితికి కారణమన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

రాయచోటి మున్సిపాలిటీలో దాహం...దాహం

జిల్లా కేంద్రమైన రాయ చోటిలో ప్రజల నుంచి దాహం కేకలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా రా యచోటిలోని పలు కాల నీలకు సంబంధించి నీటి కోసం వారం రోజులు పడుతోంది. అంతేకాకుండా కొనుగోలు చేస్తుండడం ఆందోళన కలిగించే పరిణామం. ప్రధానంగా వెలిగల్లు ప్రాజెక్టుకు సంబంధించి రెండో పైపులైన్ పనులు నిలిచిపోవడంతో రాయచోటికి తాగునీటికి ఇబ్బందులు ఎ దురవుతున్నాయి. అంతో, ఇంతో నీరు లభిస్తున్నా పూర్తి స్థాయిలో రెండో పైపులైన్ ఉంటేనే ప్రజలకు ఇబ్బంది లేకుండా అందించేందుకు అవకాశం ఉంటుంది.

8గ్రామాలను తాకుతున్న తాగునీటి సమస్య

పట్టణాల్లోని శివారు ప్రాంతాలే కాకుండా గ్రామాలను తాగునీటి ఎద్దడి తాకింది. నందలూరు మండలంలోని ఎస్టీ కాలనీల్లో సమస్య తీవ్రంగా ఉంది. ఎక్కడో పొలాల వద్దకు వెళ్లి మంచినీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. అలాగే మిగిలిన నియోజకవర్గాల్లోని అనేక గ్రామాల్లో రానున్నరోజుల్లో తాగునీటి సమస్య తీవ్రమయ్యే అవకాశాలు లేకపోలేదు. ఎందుకంటే స్కీముల్లోని బోర్లు కూడా ఎండ సెగ తగిలి భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. ఏది ఏమైనా ఈ వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడడం అధికారులకు తలకుమించిన భారంగా మారనుంది.



లక్కిరెడ్డిపల్లె మండలం జి.వడ్డిపల్లెలో నీరు పట్టుకునేందుకు బిందెలను వరుసలో ఉంచిన మహిళలు

ఎండిపోతున్న సీజనల్ బోర్లు

జిల్లాలో వేసవి కాలం వచ్చిందంటే సీజనల్ బోర్లు ఎండిపోతున్నాయి. కేవలం వర్షాకాలం, ఇతర సీజన్లలో నీరు ఉన్నప్పుడు మాత్రమే బోర్లు పనిచేస్తున్నాయి. వేసవి ప్రారంభమైందంటే భూగర్భ జలాలు అడుగంటి సీజనల్ బోర్లు పనికుండా ఉన్నాయి. 10 సీపీడబ్ల్యూ, 4896 పీడబ్ల్యూఎస్ స్కీములు ఉన్నాయి. అంతేకాకుండా జిల్లా వ్యాప్తంగా 8946 బోర్లు ఉండగా, అందులో 2980 సీజనర్ బోర్లు ఎండిపోయాయి.

సమస్య తలెత్తకుండా చర్యలు

జిల్లాలో ఎక్కడా కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఎక్కడెక్కడా ప్రమాదం ఉంటుందన్న విషయం తెలుసుకుని పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించాం. వేసవి నేపథ్యంలో ఏప్రిల్, మే నెలల్లో కొంత నీటికి ఎక్కువ డిమాండ్ ఏర్పడనుంది. అందుకు అనుగుణంగా పరిష్కారానికి అన్ని చర్యలు చేపడుతున్నాం.

– ప్రసన్నకుమార్, సూపరింటెండెంట్ ఇంజినీరు, ఆర్‌డబ్ల్యూఎస్, రాయచోటి, అన్నమయ్య జిల్లా

అర్జీలకు సత్వరమే పరిష్కారం

– జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జిల్లా సంయుక్త కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్స్, టీ సౌకర్యాలను కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ మధుసూదన్ రావు, ఎస్‌డీసీ రమాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షలకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ

కడప రూరల్ : మెగా డీఎస్సీ పరీక్షలకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ జిల్లా సంచాలకులు యం భరత్‌కుమార్ రెడ్డి తెలిపారు. బీసీ, ఈడబ్ల్యూఎస్ (ఈబీసీ) కేటగిరీకి చెందిన అభ్యర్థులు ఉచిత శిక్షణ కోసం ఈ నెల 10వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు టెట్ పరీక్షలో అర్హత సాధించిన మార్కుల జాబితా నేటివిటీ, కుల, ఆదాయం ధృవీకరణ పత్రాలతో రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు జతపరచి కడప పాతరిమ్స్‌లో గల ఏపీ బీసీ స్టడీ సర్కిల్, బీసీ భవన్ రెండో అంతస్తులోని కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో లేదా 9849919221 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన

సిద్దవటం : మండలంలోని వెంకటేశ్వరపురం, మాధవరం–1 గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయా ప్రాంతాల ప్రజలు సోమవారం ఖాళీ బిందెలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ వెంకటేశ్వరపురంలోని ప్రజలకు 2 వారాలకు ఒక సారి తాగునీరు వస్తోందని, అవికూడా 3,4 బిందెలు మాత్రమే వస్తున్నాయన్నారు. తాము రోడ్డు అవతలికి వెళ్లి మంచినీళ్లు తెచ్చుకుంటున్నామన్నారు. మరికొందరు ఒకక్యాన్ రూ. 10 చెల్లించి తాగుతున్నామని వాపోయారు. తాగునీరు రావడం లేదని సర్పంచ్‌ను అడిగితే 2నెలల వరకు రావంటాడు, మా సమస్యను ఎవరికి చెప్పుకోవాలన్నారు. మాధవరం–1 గ్రామ ప్రజలు తాగునీరు రాక చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. తాగునీటి కోసం కొళాయిల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వెంకటేశ్వరపురంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఖాళీ బిందెలతో మహిళల నిరసన

పరీక్షా ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం ఎమ్మెస్సీ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలను సోమవారం వైవీయూలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి, కులసచివులు ఆచార్య పి.పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య కెఎస్వీ కృష్ణారావు, డీన్ ఆచార్య ఎ.జి.దాముతో కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఆచార్య రఘునాథ రెడ్డి మాట్లాడుతూ బోటని, బయోకెమిస్ట్రీ, జియాలజీ, మైక్రోబయాలజీ, ఫిజిక్స్ ఎన్విరాన్మెంటల్ సైన్సు, జెనెటిక్స్ అండ్ జీనోమిక్స్ కాంపుటేషనల్ డేటా సైన్స్ కోర్సులలో వందశాతం ఉత్తీర్ణత లభించిందన్నారు. మ్యాథమ్యాటిక్స్ 75శాతం, ఫుడ్ టెక్నాలజి 95 శాతం , జువాలజి 96.43 శాతం, కంప్యూటర్ సైన్స్ 68 శాతం, బయోటెక్నాలజి 97.62 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని వారు అభినందించారు. విద్యార్థులు ఫలితాల కోసం httpr:www.yvuŠbèlxamr. in/reru tr.arpx వెబ్‌సైట్‌ను సందర్శించాలని పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్వీ కృష్ణారావు విద్యార్థులకు సూచించారు.

36వ రోజుకు చేరిన సమ్మె

ప్రొద్దుటూరు రూరల్ : వైఎస్సార్ జిల్లా గోపవరం గ్రామ పంచాయతీ సమీపంలోని పశువైద్య కళాశాల విద్యార్థులు తమకు స్టైఫండ్ పెంచాలని చేస్తున్న సమ్మె సోమవారం 36వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పశువైద్య విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఎంబీబీఎస్ విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచే వరకు సమ్మెను విరమించమని తేల్చి చెప్పారు.



కళాశాల వద్ద సమ్మె చేస్తున్న పశువైద్య విద్యార్థులు

వీఆర్వో అక్రమాలపై బాధితుల గగ్గోలు

'సాక్షి'కథనంతో విచారణ చేపట్టిన తహసీల్దార్

గాలివీడు : అవినీతి వీఆర్వో బాగోతం తవ్వేకొద్దీ అక్రమాలు కోకొల్లలుగా బయటకు వస్తున్నాయి. 'వీఆర్వో రూటే సప'రేటు'శీర్షికతో ఆదివారం సాక్షిలో వెలువడిన కథనంతో సోమవారం బాధితులు మూకుమ్మడిగా రెవెన్యూ కార్యాలయం వద్దకు చేరుకుని తహసీల్దార్ ముందు వీఆర్వో రవీంద్రారెడ్డి చేసిన అవినీతి అక్రమాలపై గగ్గోలు పెట్టుకున్నారు. బాధితులు కొండ్రెడ్డి చిన్న రెడ్డన్న తన అనుభవంలో ఉన్న సర్వే నంబర్ 900బీ1లో 40 సెంట్ల భూమి ఇతరుల పేరుపై ఆన్లైన్ చేయించారని, అలాగే దాదినేని నారాయణ పట్టా భూమి సర్వే నంబర్ 2343/4, 2344/4, 2344/6 లలో మొత్తం 75 సెంట్ల భూమిని సదరు వీఆర్వో మామూళ్లకు ఆశపడి వేరొకరి పేరుపై ఆన్‌లైన్ చేయించాడని వాపోయారు. ఇలా చాలా మంది బాధితులు తహసీల్దార్ భాగ్యలత ముందు తమ గోడును వినిపించగా వారి స్టేట్‌మెంట్‌ను రాతపూర్వకంగా రికార్డు చేశారు. వీఆర్వోపై వస్తున్న ఆరోపణలపై విచారణ జరపుతామని, ఉన్నతాధికారులకు నివేదిక పంపుతానని తహసీల్దార్ తెలిపారు. ఇదిలా ఉండగా వీఆర్వో అర్హులకు న్యాయం చేయకుండా ముడుపులు తీసుకుని అనర్హులకు మేలు చేస్తున్నాడని కొందరు వాపోతున్నారు.

వీఆర్వో బలమైన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం, మండల స్థాయి అధికారులను ప్రభావితం చేస్తుండటంతో చాలామంది స్వేచ్ఛగా ముందుకొచ్చి వారికి జరిగిన అన్యాయాన్ని చెప్పుకోలేకపోతున్నారు. జిల్లా స్థాయి అధికారులు స్పందించి.. క్షేత్రస్థాయిలో పర్యటించి వీఆర్వో అక్రమాలపై విచారణ చేపట్టాలని బాధితులు కోరుతున్నారు.



తహసీల్దార్‌తో సమస్యలు చెప్పుకుంటున్న బాధితులు

ఫిర్యాదు చేసినా ఫలితంలేదు



మామూళ్లకు అలవాటు పడిన వీఆర్వో రవీంద్రారెడ్డి పట్టా భూమి 75 సెంట్లు వేరొకరి పేరుపై ఆన్‌లైన్ చేశారు.దీని గురించి వీఆర్వోను ప్రశ్నిస్తే ముఖం చాటేస్తున్నారు.ఇదే విషయమై పలుమార్లు గ్రీవెన్స్‌సెల్‌లో, రెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.రెండు పర్యాయాలు మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకున్నప్పటికీ రెవెన్యూ అధికారులు తిరస్కరించారు.జిల్లా అధికారులు వెంటనే వీఆర్వో పై విచారణ జరిపి మాకు న్యాయం చేయాలి. – దాదినేని నారాయణ, గోరాన్ చెరువు,గాలివీడు మండలం.

న్యాయం చేయాలి



గోరాన్ చెరువు వీఆర్వో 900బీ1 లో ఉన్న 85 సెంట్లు నా భూమిని వేరొకరి పేరుపై ఆన్లైన్ చేయించారు.ఈ వ్యవహారంలో గోరాన్ చెరువు వీఆర్వో పూర్తిగా అవినీతికి పాల్పడ్డారు.నా భూమిని స్వాహా చేశారు.అధికారులు విచారణ జరిపి న్యాయం చేయలి. – కొండ్రెడ్డి చిన్న రెడ్డెన్న, గాలివీడు

ఒత్తిడి వద్దు..పదిని జయించు

- పక్కా ప్రణాళకతో చదవాలి
- నిపుణుల సూచన

మదనపల్లె సిటీ : వార్షిక పరీక్షలు సమీపిస్తున్న సమయాన విద్యార్థుల్లో భయాన్ని తొలగించి, ఆత్మవిశ్వాసాన్ని కలిగించేలా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇటీవల 'పరీక్ష పే చర్చ' కార్యక్రమాన్ని నిర్వహించారు. పరీక్షలు సమీపిస్తున్న వేళ ఎక్కువ మార్కులు సాధించాలని, మంచి ర్యాంకు రావాలని తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఈ తరుణంలో మోదీ మాటలను ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిందే. జిల్లాలో గత ఏడాది మార్కులు తక్కువ వచ్చాయని కొందరు విలువైన జీవితాన్ని కోల్పోయారు. పది మార్కులే జీవితం కాదన్న సత్యాన్ని అంతా గ్రహించాలి. ఇంకా వారం రోజులు సమయం ఉందని, ఒత్తిడికి లోను కావద్దని, పక్కా ప్రణాళికతో చదివితే మంచి మార్కులు, ర్యాంకు సాధించే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. నిత్యం పాఠశాలలో రాసే పరీక్షల వంటివే అన్న భావనతో సిద్ధమవ్వాలని చెబుతున్నారు.



పదో తరగతి ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు

ఏం చేయాలంటే..

సమయానికి ఆహారం తీసుకోవాలి. పండ్లు ఎక్కువగా తినాలి. పరీక్ష వేళ ఒత్తిడికి గురికాకుండా తగిన నిద్ర అవసరం. అన్ని సబ్జెక్టులకు సమయాన్ని కేటాయించుకుని చదువుకోవాలి. కష్టమైన సబ్జెక్టుని ఇష్టంగా చదువుకోవాలి. బృందపఠనం అవసరం. ఏకాగ్రత కోసం ఉదయాన్నే ధ్యానం వంటి సాధనలు చేయాలి. అనుమానాలను ఉపాధ్యాయులతో చర్చించి నివృత్తి చేసుకోవాలి.


నిలకడగా ఉండాలి



సమయం తక్కువ. కొండంత కోర్సు ఉందని తలుచుకుని అనవసరంగా గందరగోళానికి గురికావద్దు.నిలకడగా ఉండాలి. సబ్జెక్టు నిపుణులను సంప్రదించి ముఖ్యమైన అంశాలను ప్రణాళిక ప్రకారం చదువుకోవడం, పునశ్చరణ చేసుకోవడం ముఖ్యం. చదివినవి కొండ గుర్తులు పెట్టుకుని పుశ్చరణ చేసుకుంటే మేలు. గంటల తరబడి చదవడం కాదు, గంట పాటు చదివి, దానిని కాగితంపై రాస్తూ సాధన చేయాలి. సెల్‌ఫోన్‌లో ఛాటింగ్, రీల్స్ చూడడం చేయరాదు.

– చాముండేశ్వరి, సైకాలజిస్టు, మదనపల్లె.

ఒత్తిడికి లోనుకావొద్దు : డీఈఓ సుబ్రమణ్యం



పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఒత్తిడికి లోనుకావొద్దని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం తెలిపారు. ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. జిల్లాలో పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 505 ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల్లో 22,355 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఇందు కోసం 121 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 1200 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. ఆరు సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు తమ హాల్‌టిక్కెట్లు చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చునన్నారు. హాల్‌టిక్కెట్లను వాట్సప్ మనమిత్ర 9552300009 నంబర్ల నుంచి పొందవచ్చని తెలిపారు.

క్లుప్తంగా

కారు కల్వర్టును ఢీకొని దంపతులకు గాయాలు

రామాపురం : కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని బండపల్లె గ్రామం టోల్‌గేటు సమీపంలో సోమవారం కారు కల్వర్టును ఢీకొనడంతో నాగిరెడ్డి, వనజ దంపతులకు గాయాలైనట్లు మండల ఎస్‌ఐ వెంకటసుధాకర్ రెడ్డి తెలిపారు. తిరుపతికి చెందిన నాగిరెడ్డి, వనజలు కడప నుంచి కారులో రాయచోటికి వస్తుండగా మార్గమధ్యంలో బండపల్లి టోల్‌గేట్ వద్దకు రాగానే కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొని కాలువలో పడింది. పోలీసు క్షతగాత్రులను 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ప్రమాదంలో మృతిచెందిన ఆదినారాయణ

ములకలచెరువు : రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం ఉదయం మండల కేంద్రంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు... సత్యసాయి జిల్లా చీకుచెట్టుపల్లెకు చెందిన ఆదినారాయణ పనుల నిమిత్తం ములకలచెరువుకు వచ్చాడు. ఈ నేపథ్యంలో రోడ్డు దాటుతుండగా మదనపల్లె వైపు నుంచి కదిరికి వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆదినారాయణ(56) సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భార్య ఉత్తమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పెట్టుబడి సాయాన్ని అందించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు, సభ్యులు

రాయచోటి అర్బన్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు కావస్తున్నా రైతులకు ఇస్తామన్న పెట్టుబడి సాయం రూ. 20 వేలు ఎప్పుడిస్తారని ఏపీ రైతు సంఘం నాయకులు ప్రశ్నించారు. ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి పోతగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధరను కల్పించి కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరల చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ముదివేడు రిజర్వాయరు నిర్వాసితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.రామాంజులు, రైతు సంఘం నాయకులు వేమనారాయణ రెడ్డి, శ్రీనివాసులు, రమణప్ప, రత్నమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

అల్లాహ్ ప్రార్థనకు పిలుపు.. అజాన్

రంజాన్ ఉపవాసాల నేపథ్యంలో కథనం



కడప కల్చరల్ : తెల్లవారుజాము సమయం. చిరు చీకట్లను తరిమివేస్తూ వెలుగు రేఖలు విచ్చుకుంటున్న వేళ. ఆ ప్రశాంత సమయంలో 'అల్లాహు అక్బర్' అంటూ గంభీరమైన స్వరం. అల్లాహ్‌ను ప్రార్థించేందుకు రమ్మంటూ ఇస్తున్న పిలుపు హృదయాన్ని తాకుతున్న ఆ ఆహ్వానాన్ని అందుకుని మన సారా దైవ ప్రార్థనలు చేసేందుకు సిద్ధమవుతున్న ముస్లింలు. మసీదులలో దైవ ప్రార్థనలకు రావాలంటూ తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు ఐదుమార్లు ఇలా అజాన్ పిలుపు వినిపించడం అందరికీ తెలిసిందే. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలు ప్రతిరోజు ఐదుసార్లు నమాజ్‌ను అధిక సంఖ్యలో మసీదులకు తరలివచ్చి ఆచరిస్తారు. ఇందులో భాగంగా అజాన్ గురించి కడప నగరానికి చెందిన ధర్మ పరిచయ కమిటీ ప్రతినిధి హజరత్ సయ్యద్ అహ్మద్ (బాబుభాయ్) ఇలా వివరిస్తున్నారు.

ప్రపంచంలోని ముస్లింలందరికీ ఈ పవిత్ర రంజాన్ మాసం ప్రాణప్రదమైనదిగా భావిస్తారు. ఈ జన్మకు ముక్తిని ప్రసాదించే దివ్య వరంగా భావించి ఈ సందర్భంగా దైవం సూచించిన మార్గాలలో తప్పక అనుసరిస్తారు. సాధారణ రోజుల్లో ఆచరించే ప్రార్థనలతోపాటు ప్రతిరోజు తరావీ ప్రార్థనలు చేయడం ఈ మాసం ప్రత్యేకతగా చెప్పవచ్చు. కేవలం రంజాన్ మాసంలోనే గాక మిగతా రోజుల్లో కూడా ముస్లింలు రోజూ ఐదు మార్లు ప్రార్థనలు చేస్తారు. రోజువారి పనుల్లో నిమగ్నమైన వారికి ప్రార్థనా సమయం ఆసన్నమైందని తెలుపుతూ మసీదుల్లోని మౌజన్లు 'అల్లాహు అక్బర్' అంటూ పిలుపునిస్తారు. అజాన్ విన్న వెంటనే వీలైనంత త్వరగా మసీదులకు చేరుకుని ప్రార్థనలు చేస్తారు. ఆజాన్‌లో వచ్చే వాక్యాలు అరబ్బీ భాషలో ఉన్నాయి. ఐదు పూటల నమాజుకు ముందు సమీపంలోని ముస్లింలందరికీ ప్రార్థనలకు వేళ అయిందని సూచిస్తూ ఇచ్చే ఈ పిలుపు ముస్లింల రోజువారి జీవితంలో ఒక భాగమైంది. ఈ పిలుపు వినగానే అసంకల్పితంగా ముస్లింలు మసీదు వైపు వెళతారు. అజాన్ అర్థం తెలిసిన వారు మాత్రమే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

అజాన్ వెనుక కథ

ఏకేశ్వరుడైన అల్లాహ్‌ను సామూహికంగా ఆరాధించేందుకు ప్రజలందరికీ ఎలా సమీకరించాలన్న విషయంపై ప్రవక్త తన అనుచరులతో సంప్రదింపులు జరిపారు. 'బూర' ఊది గుర్తించాలని కొందరు, డోలు మోగిస్తే బాగుంటుందని మరికొందరు, జెండా ఊపితే మంచిదని మరికొందరు ఇలా రకరకాల సలహాలు ఇచ్చారు. ఈ విషయంగా అబ్దుల్లా బిన్ జైద్ ర.జి. దీర్ఘంగా ఆలోచించడం ప్రారంభించారు. ఒక రాత్రి కలలో ఇప్పుడు మనం వింటున్న అజాన్ పిలుపులోని మాటలను ఆయన అనుభూతించారు. ఈ విషయాన్ని మహా ప్రవక్తకు తెలిపారు. హజరత్ ఉమర్ ర.జి.లు కూడా ఇదే కలగన్నారు. విషయం తెలుసుకున్న ప్రవక్త మహనీయుడైన ఉమర్‌ను పిలిచి వచ్చిన కల గురించి అడిగారు. తనకంటే ముందు అబ్దుల్లా బిన్ జైద్ ఈ కల గన్నారని, కనుక ఆయన ద్వారానే వివరాలు వినడం మంచిదని భావిస్తున్నామని ఉమర్ తెలిపారు. ప్రవక్త తన ప్రియ సహచరుడు హజరత్ బిలాల్ ర.జి.ని పిలిచి అబ్దుల్ బిన్ జైద్ ఏ వాక్యాలు పలుకుతారో వాటిని మీరు గొంతెత్తి గట్టిగా పలకాలని ఆదేశించారు. ఆ వాక్యాలకు అజాన్ అనే పేరు ఖరారైంది.

మసీదుల్లో అజాన్ పిలుపునిచ్చే వ్యక్తిని మౌజన్ అంటారు. ఈ పిలుపు ద్వారా 'ఓ మానవులారా అల్లాహ్ సర్వోన్నతుడు.. గుణ విశేషణాలలో అద్వితీయుడు.. స్వయం ప్రభువు, ఆది మధ్యాంత రహితుడు, అనంతుడు, పోలిక లేనివాడు, నిర్వికారుడు, సమస్త సృష్టికి నిర్దేశకుడు, సర్వశక్తివంతుడు, అంతర్యామి, సృష్టికర్త' అని వివరిస్తాడు.

అజాన్.. దాని అర్థం ఇలా ఉంది
అల్లాహు అక్బర్...అల్లాహు అక్బర్...
అల్లాహు అక్బర్....అల్లాహు అక్బర్...
(అల్లాహ్ సర్వోన్నతుడు)
అష్హదు అన్ లాయిలాహ ఇల్లల్లాహ్
అష్హదు అన్ లాయిలాహ ఇల్లల్లాహ్
(అల్లాహ్ తప్ప మరెవరూ ఆరాధనకు అర్హులు కాదని నేను సాక్ష్యం ఇస్తున్నాను)
అష్హదు అన్న మహమ్మదర్రసూలుల్లాహ్
అష్హదు అన్న మహమ్మదర్రసూలుల్లాహ్
(మహమ్మద్(సొ.అ.వ) అల్లాహ్ సందేశ హరులు అని నేను సాక్ష్యం పలుకుతున్నాను)
హయ్య అలస్సలాహ్....హయ్య అలస్సలాహ్
(రండి నమాజ్ వైపునకు రండి)
హయ్య అలల్‌ఫలాహ్...హయ్య అలల్‌ఫలాహ్
(రండి సాఫల్యం వైపునకు)
అస్సలాతు ఖైరుమ్ మిన్ననౌమ్
అస్సలాతు ఖైరుమ్ మిన్ననౌమ్
(నిద్రకన్నా నమాజ్ ఉత్తమమైనది)
అల్లాహు అక్బర్....అల్లాహు అక్బర్
(అల్లాహ్ సర్వోన్నతుడు)
లా ఇలాహ ఇల్లల్లాహ్
(అల్లాహ్ తప్ప మరెవ్వరూ ఆరాధ్యులు లేరు)

'అస్సలాతు ఖైరుమ్ మిన్ననౌమ్'- ఈ వాక్యాలను తెల్లవారుజామున ఇచ్చే అజాన్‌లో మాత్రమే పలుకుతారు.

సంఘమిత్ర చేతివాటం

రూ.10 లక్షలు స్వాహా

నిమ్మనపల్లె : మహిళా సమాఖ్యలోని సంఘ సభ్యుల అభ్యున్నతికి అండగా నిలవాల్సిన సంఘమిత్ర తన పరిధిలోని ఐదు డ్వాక్రా సంఘాల నుంచి సుమారు రూ.10 లక్షలకు పైగా నిధులను స్వాహా చేసింది. నిధుల స్వాహాపై మండల సమాఖ్య అధ్యక్షురాలు మంజుల, వెలుగు ఏపీఎం మురళి సోమవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన మేరకు వివరాలు.. అగ్రహారం పంచాయతీ, నవోదయం గ్రామ సమాఖ్యలో సంఘమిత్రగా పని చేసిన శారద సమాఖ్యలోని 5 డ్వాక్రా సంఘాల సభ్యులు చెల్లించిన నిధులు సొంత ప్రయోజనాలకు వాడుకుని, నిధుల దుర్వినియోగానికి పాల్పడిందన్నారు. దీనిపై సంఘాలలోని సభ్యులు నిమ్మనపల్లి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఫిర్యాదు చేయగా, గత ఏడాది సెప్టెంబర్ 4వ తేదీన క్షేత్ర స్థాయిలో సభ్యులను విచారించామన్నారు. గ్రామ సమాఖ్య సంఘాలకు సంబంధించిన ఉన్నతి, స్త్రీనిధి కాంపోనెంట్ పరిధిలో సభ్యుల రుణాలకు సంబంధించిన పుస్తకాలను ఆడిట్ చేయగా సుమారు రూ.10 లక్షలకు పైగా నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు తేలిందన్నారు. నిధుల దుర్వినియోగాన్ని అంగీకరించిన సంఘమిత్ర అదే రోజున రూ.2 లక్షలను తిరిగి చెల్లించిందన్నారు. మిగతా మొత్తాన్ని చెల్లించడానికి నెల రోజులు సమయం కావాలని కోరడంతో, నెల రోజులు గడువు ఇచ్చామన్నారు . గడువు పూర్తయి ఆరు నెలలు కావస్తున్నా దుర్వినియోగం సొమ్మును చెల్లించకపోగా, నిధులను చెల్లించాలని కోరుతున్న సంఘ సభ్యులపై, మహిళా సమాఖ్య సిబ్బందిపై దౌర్జన్యానికి పాల్పడుతోందన్నారు.

అత్యాచారం కేసులో నిందితుల అరెస్టు


అత్యాచారం నిందితుల అరెస్టు చూపుతున్న రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ

మదనపల్లె : నిమ్మనపల్లె మండలంలో ఓ వివాహితపై అత్యాచారం చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు మదనపల్లె రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ తెలిపారు. సోమవారం స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. ఫిబ్రవరి 28వ తేదీ సాయంత్రం నిమ్మనపల్లి మండలం తవళం గ్రామం నాయనవారిపల్లెకు చెందిన ఓ వివాహిత (21) పాలు పోసేందుకు తమ గ్రామం నుంచి పక్కనే ఉన్న నల్లంవారిపల్లెకు వెళ్లి డిపోలో పాలు పోసి తిరిగి వస్తుండగా, నల్లంవారిపల్లెకు చెందిన పి.రమణ కుమారుడు పల్లపు నాగేంద్ర (23), డి.వెంకటరమణ కుమారుడు దేవర ఇంటి సురేంద్ర (33), కాపు కాచి బాధితురాలిపై అత్యాచారం చేశారు. ఆ సమయంలో జరిగిన విషయం బయటకు చెబితే బాధితురాలిని, ఆమె భర్తను చంపేస్తామంటూ బెదిరించారు. దీంతో బాధిత మహిళ వారం రోజుల తర్వాత నిమ్మనపల్లె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాలతో, డీఎస్పీ దర్బార్ కొండయ్య నాయుడు సూచనలతో కేసు దర్యాప్తు చేశామన్నారు. నిందితులను సోమవారం అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

టీడీపీ 'బెల్ట్' మద్యంపై ఎస్‌ఐ వేటు!

- మద్యం షాపు ఓనర్లపైనా కేసు నమోదు
- మరో ఇద్దరి అరెస్టు


టీడీపీ బెల్ట్ మద్యం నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

కురబలకోట : ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించారు. బెల్ట్ మద్యం విక్రయిస్తూ ఇద్దరు పట్టుబడినట్లు ఎస్‌ఐ సోమవారం తెలిపారు. పి. సుబ్రమణ్యం (65), జి. వెంకట్రమణ (60) మండలంలోని కంటేవారిపల్లె వద్ద అధిక ధరలకు మద్యం అమ్ముతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ బెల్ట్ మద్యాన్ని అంగళ్లలోని సూరి వైన్స్, రుద్ర వైన్స్ నుంచి కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. దీంతో మద్యం షాపు ఓనర్లు, టీడీపీ నాయకులు సూరి, బాలకృష్ణను కూడా నిందితులుగా చేర్చి కేసు నమోదు చేశామన్నారు. బెల్ట్ షాపుల వ్యవహారంలో అధికార టీడీపీ మద్యం షాపు ఓనర్లపై కూడా కేసు నమోదు కావడంతో ఆ పార్టీ శ్రేణులు ఉలిక్కి పడుతున్నాయి. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఎక్కడైనా మద్యం బెల్ట్ షాపులు ఉన్నట్లయితే 9440900705 మొబైల్ నెంబరుకు సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- పట్టపగలే చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్టు
- 200 గ్రాముల బంగారు నగలు, కెమెరా స్వాధీనం
- ఎస్పీ విద్యాసాగర్ నాయుడు


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామనాథ్‌హెగ్డే

రాయచోటి : తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా పట్ట పగలు దొంగతనాలకు పాల్పడుతున్న దొంగను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 200 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. సోమవారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కచ్చిలేట్ వెంకటేశ్వర్లు తిరుపతి జిల్లా అంబేద్కర్ కాలనీ ఆటోనగర్‌లో ఉంటున్నాడని తెలిపారు. ఇతనిపై తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, అన్నమయ్య జిల్లాలో దొంగతనాలకు పాల్పడినట్లు 19 కేసులు నమోదయ్యాయన్నారు. రైల్వేకోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 2024 అక్టోబర్ 8వ తేదీన దొంగతనానికి పాల్పడిన కేసులో వెంకటేశ్వర్లు నిందితుడిగా ఉన్నాడన్నారు. పోలీసులకు అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రాయచోటి సీసీఎస్, రైల్వేకోడూరు పోలీసులు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టి ఈనెల 9న అదుపులోకి తీసుకున్నారన్నారు. తాళం వేసిన ఇంటిలో పగటిపూట దొంగతనాలు చేయడం వృత్తిగా అలవర్చుకున్నట్లు తెలిపారు. వెంకటేశ్వర్లుపైన 19 కేసులు నమోదు కాగా అందులో ఒక మర్డర్ కేసు, హత్యాయత్నం కేసు, మిగిలిన 17 దొంగతనం కేసులు నమోదయ్యాయన్నారు. దొంగతనాలకు పాల్పడుతున్న సమయంలో నిందితుడికి ప్రమాదం జరిగి కుడి కాలుకు సర్జరీ చేసి రాడ్లు వేశారన్నారు. అతని వద్ద నుంచి సుమారు 200 గ్రాముల బంగారం నగదు, ఒకసోని ఏ7 కెమెరాను స్వాధీనం చేసుకున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న నగల విలువ రూ.17.50 లక్షలుగా ఉందన్నారు. నిందితుడు నడవలేని స్థితిలో చికిత్స పొందుతుండటం వలన 35(3) బీఎన్ఎస్ యాక్టు కింద నోటీసు ఇచ్చామన్నారు. ఈ కేసును ఛేదించడంలో రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే, సీసీఎస్ సీఐ ఎం.చంద్రశేఖర్, రైల్వేకోడూరు సీఐ హేమసుందర్, సీసీఎస్ ఎస్ఐ రామకృష్ణారెడ్డి, కోడూరు ఎస్ఐ నవీన్, సీసీఎస్ కోడూరు పోలీసు సిబ్బందిని అభినందించారు.

సీసీ కెమెరాలతో ప్రయోజనం..

ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల గుర్తింపు, నేరాల పరిశీలనకు సీసీ కెమెరాలు ఏర్పాటుతో చెక్ పెట్టవచ్చని, వీటి ఏర్పాటు వలన అనేక రకాలైన ప్రయోజనాలు ఉన్నాయని ఎస్పీ తెలిపారు. మార్కెట్లు, బస్టాండు, రైల్వేస్టేషన్లు, షాపింగ్ మాల్స్, ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, దేవాలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అవసరమన్నారు.

ప్రతి సమస్యకు చట్ట పరిధిలో పరిష్కారం

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులకు చట్ట పరిధిలో పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చట్ట పరిధిలో బాధితులకు న్యాయం జరిగేలా భరోసా కల్పించాలని, పోలీసులు నిష్పక్షపాతంగా చట్టప్రకారం దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఫోన్ ద్వారా, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను ఆదేశించారు.

దాడులు అరికట్టాలి


ర్యాలీ నిర్వహిస్తున్న వీహెచ్‌పీ, హిందూ చైతన్య వేదిక నాయకులు

మదనపల్లె : రాయచోటిలో ఈనెల 4వ తేదీన వీరభద్రస్వామి పార్వేట ఉత్సవం సందర్భంగా జరిగిన సంఘటనను నిరసిస్తూ సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. దాడులను అరికట్టాలని, నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని కోరుతూ సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌కు వినతి పత్రం అందజేశారు. దాడుల ఘటనలపై పోలీసు యంత్రాంగం సరైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో చైతన్య వేదిక రాష్ట్ర మహిళా కార్యదర్శి పావని, జిల్లా కార్యదర్శి కామేశ్వరరావు, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్, కార్యదర్శి సురేష్, బీజేపీ నాయకులు బండి ఆనంద్, ఆకుల కృష్ణమూర్తి, భగవాన్, జర్మనీ రాజు, చెంబుకూరు కృష్ణమూర్తి, వరదా రెడ్డి గారి నారద రెడ్డి, పూల నాగరాజా పాల్గొన్నారు.

యువతను వంచించిన చంద్రబాబు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల


పోస్టర్లు విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల, నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : ఎన్నికల ముందు యువత, నిరుద్యోగులు, విద్యార్థులకు మాయమాటలు చెప్పి హామీలు ఇచ్చి అధికారం చేపట్టాక చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్‌లు యువత, నిరుద్యోగులను నయవంచన చేశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఈనెల 12న జరిగే యువత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది అవుతున్నా ఒక్కహామీ ఊసు కూడా లేదన్నారు. యువత, విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో చంద్రబాబు ఆడుకొంటున్నారని ధ్వజమెత్తారు. ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ లేక విద్యార్థుల చదువులు కుంటు పడుతున్నాయని తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇచ్చి, ఫీజు రీ ఎంబర్స్‌మెంట్, అమ్మ ఒడి, నాడునేడు, ఇంగ్లీష్ మీడియం ఇలా చదువుకు అండగా ఉండి విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసిందని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో 17 మెడికల్ కాలేజీలు మంజూరు చేస్తే తమకు వద్దని కేంద్రానికి తెలియజేసిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబేనని విమర్శించారు. యువత, నిరుద్యోగుల కోసం ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించి, నిరుద్యోగులకు రూ.2000 నిరుద్యోగ భృతి ఇవ్వకుంటే చొక్కా పట్టుకోవాలని లోకేష్ నాడు సభల్లో చెప్పాడని, అలాగే కూటమి చెప్పే మాటలకు తాను హామీగా ఉండి ప్రశ్నిస్తానన్న ఉప ముఖ్యమంత్రి పవనస్ కళ్యాణ్ ఎక్కడికి వెళ్లాడని ప్రశ్నించారు. చంద్రబాబు వంచనకు నిరసనగా ఈనె 12న రాయచోటిలో జరిగే నిరసన, కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు యలగచెర్ల శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, రమేష్, మండల నాగేంద్ర, అన్వర్‌బాషా, తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, కొరెడ్డి సిద్దయ్య, ఉమామహేశ్వర్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సమస్యలతో కూలీ ఆత్మహత్య


రాజు (ఫైల్)

మదనపల్లె : మద్యానికి బానిసై తరచూ కుటుంబ సభ్యులతో గొడవపడుతూ, మనస్తాపం చెంది కూలీ ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం రాత్రి మదనపల్లెలో జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. అనంతపురం జిల్లా ధర్మవరం మండలం ఎర్రగుంట్లపల్లెకు చెందిన సుంకప్ప, విజయలక్ష్మి దంపతుల కుమారుడు ఎస్.రాజు (38), 20 సంవత్సరాల క్రితమే ఉపాధి కోసం మదనపల్లెకు వచ్చాడు. పట్టణంలోని గజ్జల కుంట తిలక్‌వీధిలో నివసిస్తూ నీరుగట్టువారిపల్లె టమాటా మార్కెట్లో కూలీగా పని చేస్తున్నాడు. తల్లిదండ్రులు మృతి చెందడం, భార్య తనని వదిలేసి వెళ్లిపోవడంతో, 10 సంవత్సరాల క్రితం గజ్జలకుంటకు చెందిన దేవితో సహజీవనం చేస్తున్నాడు. ఆమెకు వాణిశ్రీ మౌనిక ఇద్దరు కుమార్తెలు ఉండగా ఆరు నెలల క్రితం వాణిశ్రీకి వివాహం చేశారు. ప్రస్తుతం దేవి మరో కుమార్తెతో కలిసి రాజు ఉంటున్నాడు. కొంతకాలంగా మద్యానికి తీవ్రంగా బానిసై ప్రతిరోజు ఇంట్లో భార్యతో గొడవ పడేవాడు. ఇద్దరి మధ్య ఘర్షణ జరిగేది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి పూటుగా మద్యం సేవించి ఇంటికి వచ్చిన రాజు భార్య దేవితో గొడవపడి కొట్టాడు. దెబ్బలు తాళలేక ఆమె కుమార్తె మౌనికను తీసుకుని గజ్జల గుంటలోని తన పుట్టింటికి వెళ్లిపోయింది. ఉదయం తిరిగి ఇంటికి వచ్చి చూడగా తలుపులు కిటికీలు మూసి ఉండడంతో, బయట నుంచి కిటికీ తలుపులు తోసి లోపలికి చూడగా, రాజు ఇంట్లో చీరతో ఉరి వేసుకుని వేలాడుతూ ఉండడాన్ని గమనించి కేకలు వేసింది. దీంతో స్థానికులు టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కిందికి దించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సమస్యల కారణంగా తీవ్ర మనస్తాపం చెంది ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని స్థానికులు, దేవి పోలీసులకు తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ రామచంద్ర తెలిపారు.

వేతనాలు పెంచాలంటూ అంగన్‌వాడీల ధర్నా

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా చేశారు. కార్యకర్తలకు చట్ట ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలన్నారు. కనీస వేతనాలు చెల్లించాలని కోరారు. శాంతియుతంగా ధర్నా చేసేందుకు విజయవాడ వెళుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి జాన్ ప్రసాద్, అధ్యక్షురాలు రమాదేవి, రాధాకుమారి, శిరీషా, లీలావతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల అరెస్టులు దుర్మార్గం

రాజంపేట రూరల్ : విజయవాడలో తలపెట్టిన మహాధర్నాకు బయలు దేరిన అంగన్‌వాడీలను అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఈ. సికిందర్ పేర్కొన్నారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజమండ్రి, కోనసీమ జిల్లాలలో రిజర్వేషన్ చేసుకొని బస్సు ఎక్కిన అంగన్‌వాడీలను దించివేయడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, నరసింహ, జమాల్, రమణ, రవి, రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పరీక్షా కేంద్రాల మార్పులు

రాయచోటి జగదాంబసెంటర్ : మదనపల్లె పట్టణంలో ఇంటర్మీడియట్ బోర్డ్ నిబంధనలకు విరుద్ధంగా పరీక్షా కేంద్రాల్లో మార్పులు, చేర్పులు చేశారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ తెలిపారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె పట్టణంలో జ్ఞానాంబిక జూనియర్ కళాశాల, నారాయణ జూనియర్ కళాశాల రెండు పరీక్షా కేంద్రాలు ఒకే బిల్డింగ్‌లో నిర్వహిస్తున్నారని తెలిపారు. దీనిపై విచారణ జరిపించాలని అనేకమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గురునాథ్, బన్నీ, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు ఇచ్చిన భూమిలో కంచె తొలగింపు

పుల్లంపేట : ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారికి రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారని కొమ్మనవారిపల్లి రెవెన్యూ గ్రామానికి చెందిన ఎ.సుమలత ఆరోపించారు. సర్వే నెంబరు. 846/1, 847లో ప్రభుత్వం తమకు 2012లో డీ పట్టా మంజూరు చేసిందన్నారు. తమ చేను చుట్టూ కంచె ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. అయితే సోమవారం సాయంత్రం రెవెన్యూ అధికారులు తమకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా కంచెను తొలగించారన్నారు. పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని కంచెను ఏర్పాటు చేసి చెట్లు పెంచుకున్న వారి జోలికి పోకుండా ప్రభుత్వం పట్టా ఇచ్చిన తమపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

దగ్ధమైన మిడిమాలపు కొండలు

గుర్రంకొండ : గుర్రంకొండ పట్టణంలోని మిడిమాలపు కొండలు కాలిబూడిదయ్యాయి. స్థానిక జగనన్న కాలనీకి పక్కనే ఉన్న మిడిమాలపు కొండ దగ్గర పెద్ద ఎత్తున కాలనీవాసులు నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారు. గత రాత్రి దుండగులు కొండకు నిప్పు పెట్టారు. దీంతో మంటలు ఎగిసి పడుతూ రాత్రిళ్ల కొండలు మొత్తం కాలిబూడిదయ్యాయి. దీంతో ఓ వైపు మంటలు, మరోవైపు దట్టమైన పొగలతో కొండలకు దిగువ భాగంలో ఉన్న ఇందిరమ్మ కాలనీ, జగనన్న కాలనీలో వందలాది కుటుంబాలు ఇబ్బందులకు గురయ్యాయి. రాత్రంతా ఎక్కడ మంటలు కాలనీ వైపు వస్తాయోనని ప్రజలు జాగారం చేశారు. మంటలు ఉవ్వెత్తున ఎగిసి పడుతూ చెట్లు, పుట్టలను కాల్చి బూడిద చేశాయి. ఈ మంటల ధాటికి అడవి జంతువులు, పక్షులు ఎక్కడికి వెళ్లలేక మంటల్లో చిక్కుకొని కాలిపోయాయి. కావాలనే నిప్పుపెట్టడంతో వందలాది ఎకరాల అడవి దగ్ధమైంది.